ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 261

పేజీలు : 5 వెల రూ. 2/-

శనివారం
18 అక్టోబర్ 2025

PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## అఫ్గాన్, భారత్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

మరోమారు మాటలు తూలిన పాక్ రక్షణ మంత్రి



2 లో

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

- ప్రభుత్వం, ఇసిని ప్రశ్నించిన హైకోర్టు
- గడువు కోరడంతో విచారణ రెండు వారాలకు వాయిదా




2 లో

# బంద్ ఫర్ జస్టిస్.. నేడు రాష్ట్ర బంద్

- బిసి సంఘాలకు అన్ని పార్టీల మద్దతు
- బిజెపి లక్ష్యంగా కాంగ్రెస్ విమర్శలు

2 లో



## పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

సీసీఐ ద్వారా క్వింటాల్ పత్తి రూ.8,110కు కొనుగోలు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



2 లో

## లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

ఆశన్న సహా 208మంది మావోల లొంగుబాటు
భారీగా ఆయుధాలు అప్పగింత
వారి పునరావాసానికి ఏర్పాట్లు చేస్తామన్న ఛత్తీస్‌ఘడ్ సిఎం



2 లో

## బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

- బిల్లును అడ్డుకోవడంవల్లనే బిసి బంద్
- బంద్‌కు పూర్తి బాధ్యత బిజెపిదే
- దమ్ముంటే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి
- బిజెపిని డిమాండ చేసిన డిప్యూటి సిఎం భట్టి



2 లో

# నామినేషన్ దాఖలు చేసిన నవీన్ యాదవ్

- యూసుఫ్ గూడ నుంచి భారీ ర్యాలీతో రాక - కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, వివేక్



2 లో

# రాష్ట్రంలో గన్ కల్చర్

- పూర్తిగా తగ్గిపోయిన పెట్టుబడులు
- రాష్ట్రానికి రావాలంటేనే భయపడుతున్న పరిశ్రమలు



2 లో

# బంద్ ఫర్ జస్టిస్.. నేడు రాష్ట్ర బంద్

ఏఎం న్యూస్, హైదరాబాద్,అక్టోబరు17 :
బంద్ ఫర్ జస్టిస్ పేరుతో 18వ తేదీన బీసీ సంఘాలు బంద్‌కి పిలుపునిచ్చాయి. బీసీ రిజర్వేషన్లు ఆమోదించాలంటూ బీసీ సంఘాలు ఆందోళన నిర్వహించనున్నాయి. ఈ క్రమంలో బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, లెఫ్ పార్టీలు కూడా బంద్‌ఉ మద్దతు ఇచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడం ద్వారా ఆవేదనను తెలియచేయాలని ఆర్ .కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఇప్పటికే అన్ని పార్టీలను నేరుగా కలిసి కోరారు. బిసి బంద్‌కు అందరి మద్దతు ఉందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా ఈ బంద్‌లో పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాను కూడా బంద్‌లో పాల్గొంటానని ఉద్ఘాటించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని ఉద్ఘాటించారు. తాము అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి ఈ బంద్‌లో పాల్గొంటున్నామని వివరించారు. బీజేపీ నేతలు ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేరని విమర్శించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఈ బంద్‌లో పాల్గొనాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణంగా మద్దతిస్తోందని ఆ పార్టీ భువనగిరి ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రేపటి బీసీ బంద్‌ని జయప్రదం చేయాలని సూచించారు. రేపటి బీసీ బంద్‌కి అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని ఉద్ఘాటించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా దేశంలో జనగణనలో భాగంగా కులగణన జరగాలని కోరారని పేర్కొన్నారు కాంగ్రెస్ డెడికేషన్ కమిషన్ పెట్టి శాస్త్రీయ పద్ధతిలో కులగణన చేసిందని గుర్తుచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలని ఆర్. కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్ కలిసి బీసీ బంద్‌కి మద్దతు కోరారని గుర్తుచేశారు. ఆర్. కృష్ణయ్యపై గురుత్వర బాధ్యత ఉందని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆర్. కృష్ణయ్య తెలంగాణలో చేసే ప్రయత్నం ఢిల్లీలో కూడా చేయాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లని ఆర్. కృష్ణయ్య ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లుపై ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. తాము కూడా మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. వారితో కలిసి ఢిల్లీకి వచ్చి ప్రధాని మోదీని, రాష్ట్రపతిని కలుస్తామని తెలిపారు. కాంగ్రెస్ బీసీ కులగణన చేసి, 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు. బీసీలకు న్యాయం చేసి బీజేపీ క్రెడిట్ తీసుకున్న తమకు నష్టం లేదని చెప్పుకొచ్చారు. కేబినెట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లుకి ఆమోదం తెలిపి గవర్నర్‌కి పంపించామని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అంశంపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ చర్చిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వాతంత్రం ఉంటుందని ఉద్ఘాటించారు. అప్పుడప్పుడూ సమస్యలు వస్తాయని.. అవి సద్దుమనుగుతాయని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్‌లో నియంత పాలన ఉండదని.. సమస్యలన్నీ సద్దుమనుగుతాయని తెలిపారు. ఇవన్నీ చిన్న చిన్న సమస్యలేనని, టీ కప్పులో తుఫాన్ లాంటివేనని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.




# బిసి బిల్లును అడ్డుకున్న పాపం బిజెపిదే

ఏఎం న్యూస్, ఖమ్మం,అక్టోబర్17:
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల ప్రకారం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు దేశంలో ఎక్కడా లేని విధంగా చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తొలిసారిగా సైంటిఫిక్‌గా తెలంగాణలో కులగణన నిర్వహించామని.. సర్వే ద్వారా వచ్చిన సమాచారంతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని చూసినట్లు తెలిపారు. చట్ట సభల్లో ఏకగ్రీవాగంగా ప్రవేశ పెట్టామని.. గవర్నర్, రాష్ట్రపతికి పంపించినట్లు తెలిపారు. అయితే తాము పాస్ చేసిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకుండా అడ్డుకట్ట వేసి రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతోందని ఆరోపించారు. ఇది బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని భట్టి మండిపడ్డారు. ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపై ధర్నా చేశామని.. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లు పాస్ చేయడమే కాకుండా న్యాయస్థానాలకు కూడా వెళ్తోందన్నారు. ఓబీసీపై సుప్రీం కోర్టులో ప్రముఖ న్యాయవాదులు పోరాడుతున్నారని తెలిపారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో పెట్టక పోవడం వల్లే... ఓబీసీలకు 42శాతం రిజర్వేషన్ కష్టమని సుప్రీం కోర్టు చెప్పే పరిస్థితి వచ్చిందన్నారు. బీజేపీ పార్టీ వల్లనే బీసీ రిజర్వేషన్ల అంశం ఇంకా పెండింగ్‌లో ఉందన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ఓబీసీ సంఘాలన్నీ కూడా రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. రేపు జరిగే ఓబీసీ బంద్‌కు ప్రధాన కారణం బీజేపీ అని అన్నారు. ఓబీసీల బంద్‌లో అన్ని పార్టీల సంఘాలు ఆమోదం తెలిపాయని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఓబీసీ బిల్లుపై ఎందుకు మొండి వైఖరి చూపిస్తున్నారని కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండిసంజయ్‌లను ప్రశ్నించారు. ప్రధానితో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఓబీసీ బిల్లును ఎందుకు పాస్ చేయించడం లేదని నిలదీశారు.



బిల్లులకు అడ్డుపడుతూ మళ్ళీ కాంగ్రెస్ పార్టీ మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఒక్క బీసీలే కాదు అన్ని వర్గాల ప్రజలు కూడా.. బీజేపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ చేస్తున్న ఆగడాలను అందరూ గమనిస్తున్నారని.. కమలం పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ఈ బంద్ జరుగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీలో ఆమోదించి పంపినా కేంద్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ప్రధానిని కలిసేందుకు సీఎం రేవంత్ లేఖ రాసినా ఆయన సమయమివ్వలేదని చెప్పారు. ఈ అంశంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని దిల్లీకి తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క కోరారు. ప్రధాని సమయం ఇస్తే.. అఖిలపక్షంతో కలిసి వచ్చేందుకు సీఎం రేవంత్ సిద్ధమని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టిన విషయాన్ని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదించేందుకు భాజపా ఎందుకు అడ్డుపడుతోందని ఆయన ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై బీసీ సంఘాలు చేపట్టిన తెలంగాణ బంద్ భాజపా వైఖరికి వ్యతిరేకంగా జరుగుతోందన్నారు. దీనికి కాంగ్రెస్ శ్రేణులతో పాటు అందరూ మద్దతు తెలపాలని కోరారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు డిప్యూటీ సీఎం. సింగరేణి కార్మికులకు దీపావళికి 400 కోట్ల రూపాయల బోనస్ చెల్లిస్తున్నామని ప్రకటించారు. సింగరేణి ఖమ్మం జిల్లా నుండే మొదలైందని.. ఇక్కడ మొదలై రాష్ట్రం అంతటా వ్యాపించిందన్నారు. సింగరేణి కార్మికులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్రంలో గన్ కల్చర్

ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్17:
రేవంత్ రెడ్డి హయాంలో పెట్టుబడులు తగ్గడంతో పాటు, తెలంగాణకు గన్ కల్చర్ వచ్చిందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నివేదికల ప్రకారం తమ హయాంలో కన్నా పెట్టుబడులు పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. బెదరింపులు, వసూళ్లే ఇందుకు కారణమని అన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డిపై కేబినెట్ మంత్రి కుటుంబ సభ్యులే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. మంత్రి కుటుంబ సభ్యుల ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపించారని, తమ్ముళ్ల కోసం ఫైల్స్ ఆపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ దండుపాళ్యం ముఠా మాదిరిగా తయారైందని ఎద్దేవా చేశారు. శుక్రవారం)తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. వ్యాపారవేత్తలకు తుపాకులు పెట్టే సంస్కృతిని రేవంత్ హయాంలో తీసుకొచ్చారని ఆక్షేపించారు. రేవంత్‌రెడ్డి హయాంలో మాత్రం అవినీతి వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలు, సినిమా ఇండస్ట్రీ, కాంట్రాక్టర్లను కాంగ్రెస్ నేతలు బెదిరించి లొంగదీసుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే కాంగ్రెస్, బీజేపీ మధ్య అక్రమ సంబంధం ఉందని భావించాల్సి ఉంటుందని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పెట్టి బెదిరించే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇంత జరుగు తుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపటం లేదు..? అని నిలదీశారు. మంత్రుల పంచాయితీలు పరిష్కరించడానికే కేబినెట్ సమావేశాలు పెడుతున్నారని సెటైర్లు గుప్పించారు మాజీ మంత్రి హరీశ్‌రావు. కేబినెట్ భేటీలో మంత్రులు తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కేబినెట్ ఆరడజను వర్గాలుగా విడిపోయిందని దెప్పిపొడిచారు. రాష్ట్ర ప్రభుత్వం అతుకుల బొంతలాగా మారిందని స్వయానా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి హయాంలోని 23 నెలల్లో ఏం సాధించారని విజయోత్సవాలు జరుపుతారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దు కోవాలన్న చందంగా.. కాంగ్రెస్ నేతలు అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నీళ్లు, నిధుల వాటాలు సాధించామని అన్నారు. హ్యామ్ మోడల్‌పై బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణ జరుపుతామని హెచ్చరించారు. హ్యామ్ మోడల్ బోగస్ అని.. కమిషన్లు దండుకోవటానికే ఈ మోడల్ తీసుకువస్తున్నారని ఆరోపించారు. దీపావళికైనా హామీలు అమలు చేస్తారని ఎదురుచూసిన ప్రజలకు మళ్లీ నిరాశే ఎదురైందని మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లొంగిపోయిన మావో అగ్రనేత ఆశన్న

ఏఎం న్యూస్, రాయపూర్,అక్టోబర్17:
మావోయిస్టు అగ్రనేత, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న అలియాస్ రూపేష్ పోలీసుల ముందు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆశన్న సహా 208 మంది మావోయిస్టులు ఉన్నారు. మావోయిస్టు చరిత్రలో ఇదే అతిపెద్ద లొంగుబాటు. వారిలో 110 మంది మహిళలు, 98 మంది పురుషులు ఉన్నారు. 153 ఆయుధాలు అప్పగించగా.. వీటిల్లో 19 ఏకే-47 రైఫిళ్లు, 17 ఎస్ఎల్ఆర్ రైఫిళ్లు, 23 ఇన్సాస్‌లు, 1 ఇన్సాస్ ఎల్ఎంజీ, 303 రైఫిళ్లు, 11 బీజీఎల్, నాలుగు కార్బైన్‌లు, 41 బోర్ షాట్‌గన్‌లు, పిస్తోళ్లు ఉన్నాయి. ఈ లొంగుబాటుపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడారు. ఇది ఛత్తీస్‌గఢ్‌కే కాదు దేశం మొత్తానికి చరిత్రాత్మకమైన రోజు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని మేం వారిని కోరుతూ వచ్చాం. ఇప్పుడు వారికి నైపుణ్యాలు కల్పించి, పునరావాసానికి ఏర్పాటు చేస్తాం అని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి జనజీవన స్రవంతిలో కలిసిన గంటల వ్యవధిలోనే ఆశన్న లొంగుబాటు ప్రకటన వచ్చింది. ఇద్దరు అగ్రనేతలు పోరాటాన్ని వీడటంతో మావోయిస్టు పార్టీకి




గట్టి షాక్ తగిలింది. ఆశన్న స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామం. నాలుగు దశాబ్దాల క్రితం పీపుల్స్‌వార్ ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. వాసుదేవరావు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం అప్పటి హనుమకొండ మండలం కాజీపేటలోని ఫాతిమా స్కూల్‌లో సెకండరీ విద్యనభ్యసించారు. కాకతీయ వర్సిటీలో డిగ్రీ చదువుతూ రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)కు నాయకత్వం వహిస్తూ ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో 25 ఏళ్ల వయసులోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. ప్రస్తుతం వాసుదేవరావు వయసు 60 ఏళ్లు పైబడి ఉంటుందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. కీలక దాడులకు ఆశన్న వ్యూహకర్త. దండకారణ్య సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా రూపేశ్ పేరుతో వ్యవహరించిన ఆశన్న.. ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డిలపై బాంబులు పేల్చి హత్యాయత్నం, 1999లో ఐపీఎస్ అధికారి ఉమేశ్‌చంద్ర హత్య, 2000లో నాటి హోంమంత్రి మాధవరెడ్డి హత్య లాంటి ఘటనలకు నేతృత్వం వహించినట్లు చెబుతారు.

# స్థానిక ఎన్నికలు ఎప్పుడో చెప్పండి

ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్17:
తెలంగాణ స్థానిక ఎన్నికల నిర్వహణపై కీలక పరిణామాలు చూటుచేసుకుంటున్నాయి. తాజాగా హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై రీనోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికలు నిర్వహించాలని పిటిషన్ లో దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఈసీ నోటిఫికేషన్ ను సస్పెండ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ న్యాయవాది సురేందర్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. వాదనలు విన్న హైకోర్టు.. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ను ప్రశ్నించింది. ఎన్నికలు నిర్వహణపై సమాధానం చెప్పేందుకు రెండు వారాల సమయం ఇవ్వాలని న్యాయస్థానాన్ని ప్రభుత్వం, ఈసీ కోరింది. దీంతో హైకోర్టు ఇందుకు అంగీకరించి రెండు వరాల సమయం ఇచ్చింది. అనంతరం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచూ ప్రభుత్వం జారీచేసిన జీవోను హోకోర్టు కొట్టివేడంతో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ సస్పెండ్ చేస్తూ స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఈ నెల 9 న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేయడానికి సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ జీవో ప్రకారమే ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే హైకోర్టు ఆ జీవోపై స్టే విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. విచారణ చేపట్టకుండానే అత్యున్నత న్యాయస్థానం సైతం రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేయడంతో రిజర్వేషన్ల పంచాయితీ అగమ్యగోచరంగా మారింది. దీనితో స్థానిక ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అటు ప్రభుత్వం నుంచి ఆర్డర్స్ రాకపోతే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. గురువారం సుప్రీంకోర్టు కూడా ఎన్నికలకు వెళ్లమని చెప్పింది కదా అంటూ వ్యాఖ్యానించింది. ఎన్నికలు పెట్టుకోవచ్చుని ఓరల్‌గా మాత్రమే చెప్పిందని.. ఆర్డర్‌లో ఎక్కడా చెప్పలేదని ఎలక్షన్ కమిషన్ తరఫు న్యాయవాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాశామని కోర్టుకు తెలిపారు. బీసీ రిజర్వేషన్లలను 42 శాతానికి పెంచుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చాం కాబట్టే దాన్ని సస్పెండ్ చేశాం. మళ్లీ రిజర్వేషన్లను గూర్చి ప్రభుత్వంతో చర్చించాకే రీ నోటిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. రెండు వారాల సమయం కావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును కోరడంతో తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

# అఫ్గాన్, భారత్‌లతో ఏకకాలంలో యుద్ధం చేస్తాం

ఏఎం న్యూస్, ఇస్లామాబాద్,అక్టోబర్17:
ఆపరేషన్ సిందూర్‌లో చావుదెబ్బతిన్నా పాక్ బుద్ధి మారడం లేదు. ప్రేలాపనలు ఆగడగం లేదు. అఫ్గాన్‌తో సరిహద్దె సమస్య, భారత్‌కు అఫ్గాన్ చేరువ కావడాన్ని పాక్ జీర్ణించుకోవడం లేదు. అవసరమైతే ఈ రెండు దేశాలతో ఏకకాలంలో యుద్ధం చేస్తామని మరోమారు పాక్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాటలు తూలారు. ఈ రకంగా భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనకు దిగింది. అప్గానిస్థాన్ మనకు దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దు వెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ..ఖ్వాజా ఆసిఫ్ ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భారత్‌తో కూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా...అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి. వాటి గురించి నేను చర్చించను అని చెప్పనంటూ భారత్ గురించి నోరుపారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. వారివల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలని వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాలు పలుచోట్ల పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దాంతో ఇరువైపులా ప్రాణనష్టం సంభవించింది. పాక్ పై దాడులు ప్రారంభమైనపుడు అఫ్గాన్ విదేశాంగ మంత్రి దిల్లీలోనే ఉన్నారని, భారత ఆదేశాల మేరకే తమపై దాడులు జరిగాయని పాక్ ఆరోపిస్తోంది. భారత్ తరఫున అఫ్గానిస్థాన్ తమపై పరోక్షయుద్ధం చేస్తోందని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆరోపణలు చేశారు. వీటికి భారత్ ప్రభుత్వం గట్టిగా కౌంటర్ ఇచ్చింది. పాక్ ఉగ్రవాద సంస్థలకు ఆతిథ్యమిచ్చి వారి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. తన అంతర్గత వైఫల్యాలకు పొరుగువారిని నిందించటం ఆ దేశానికున్న అలవాటు. అఫ్గానిస్థాన్ తన సొంత భూభాగాలపై సార్వభౌమత్వాన్ని చెలాయించడం పాక్‌కు కోపం తెప్పిస్తోందని భారత విదేశాంగశాఖ మండిపడింది.

# పత్తిని కేంద్రమే కొనుగోలు చేస్తుంది

ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్17:
కేంద్ర ప్రభుత్వం పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. క్వింటాల్ పత్తి రూ.8,110 ధరకు సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. తెలంగాణలో పత్తి సాగు ఉత్పత్తి పెరుగుతోందని.. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ముందు ఉందన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో వరితో పాటు అత్యధికంగా సాగవుతున్న పంట పత్తి అని.. రాష్ట్రంలో 45లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతోందని తెలిపారు. 22 లక్షలకు పైగా రైతులు పత్తిని పండిస్తున్నారన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తోందన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో పడి మోస పోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చివరి క్వింటాల్ వరకు కొనుగోలు చేస్తుందని ప్రకటించారు. కొనుగోలు కేంద్రాలను మరో 12పెంచామని.. మొత్తం 122 కొనుగోలు కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు కేంద్రమంత్రి. పత్తి సాగు ఉత్పత్తిలో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. తొమ్మిది ప్రాంతీయ భాషల్లో పత్తి సాగుకు సంబంధించి కిసాన్ యాప్‌ను తీసుకొచ్చామని.. యాప్‌లో రైతులు నమోదు చేసుకుంటే.. స్లాట్ ద్వారా పత్తిని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చని అన్నారు. పత్తి శుద్ధి, రవాణా కోసం జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ వల్ల పంట దిగుబడి డబుల్ అవుతుందని తెలిపారు. మహారాష్ట్ర అకోలా ప్రాంత ప్రజలు హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేస్తున్నారని.. హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్‌పై అవగాహన కోసం అవసరమైతే రైతులను మహారాష్ట్రకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి మన రైతులు హై డెన్సిటీ ఎ÷-లాంటేషన్ చేసేలా పని చేస్తామన్నారు. కిసాన్ యాప్ దీపావళి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పదేళ్లలో కనీస మద్దతు ధర వంద శాతం పెరిగిందన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయని.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపుతున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# నామినేషన్ దాఖలు చేసిన నవీన్ యాదవ్

ఏఎం న్యూస్, హైదరాబాద్, అక్టోబర్17:
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. నవీన్ యాదవ్ యూసుఫ్ గూడ నుంచి నామినేషన్ వేయడానికి భారీ ర్యాలీగా వెళ్లారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇతర ముఖ్య నేతలు తరలివచ్చారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్ పోటీ చేస్తుండగా.. బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. అలానే బీఆర్ఎస్ పార్టీ నుంచి దివంగత నేత మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత బరిలో నిలిచారు. ఈ ముగ్గురు జూబ్లీహిల్స్ నియోజకవర్గం స్థానికులు కావడంతో ఉపఎన్నిక ఆసక్తికరంగా మారింది. మాగంటి సునీత మినహా మిగిలిన ఇద్దరు అభ్యర్థులు గత కొన్ని ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే పోటీ చేస్తూ వస్తున్నారు. అయితే స్థానికంగా ఈ ముగ్గురికి గట్టి పట్టుంది. హైదరాబాద్ లోని యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తి నవీన్ యాదవ్. ఈయన బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో డిగ్రీ పొందారు. ఆయన తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ సిటీలో పేరున్న సోషల్ వర్కర్. నవీన్ యాదవ్ తొలిసారి 2014లో మజ్లిస్ పార్టీ తరపున జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి కేవలం 9 వేల పైచిలుకు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం చవిచూశారు. 2018 లో ఇక్కడి నుంచే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి..భారీగానే ఓట్లు సంపాదించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ లో చేరిన నవీన్ యాదవ్.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. అప్పటి నుంచి పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ముచ్చటగా మూడోసారి జూబ్లీహిల్స్లో పోటీ చేస్తున్నారు. ఈ సారి ఎలాగైనా గెలవాలనే దృఢ నిశ్చయంతో నవీన్ యాదవ్ ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ త్రోబాల్ అసోషియేషన్ కు రాష్ట్ర అధ్యక్షుడిగా నవీన్ యాదవ్ కొనసాగుతున్నారు. ఈ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ కు ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.



# యాంటీ డ్రగ్స్ ఫోరం కన్వీనర్‌గా మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి

ఏ ఎం న్యూస్ ఓయూ:

నాచారంలో జేఏసీల ఆధ్వర్యంలో మరో కొత్త జేఏసీ ఆవిర్భవించింది. యువత ను మత్తు పదార్థాల నుండి రక్షించాలని ఉద్దేశం తో యాంటీ డ్రగ్స్ ఫోరం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ ఫోరం జేఏసీ కన్వీనర్‌గా మామిడాల సంతోష్ రెడ్డి ని జేఏసీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంతోష్ రెడ్డి భారత నేవీలో పనిచేసిన అనుభవం కలిగినవారు. దేశ సేవలో ఆయనకు ఉన్న అనుభవం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు యువతను సరైన దిశలో నడిపించేందుకు దోహదపడతాయని అందరూ అభిప్రాయపడ్డారు.సమాజంలో మాదకద్రవ్యాల వాడకాన్ని నిర్మూలించి, యువతకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడమే ఈ ఫోరమ్ ప్రధాన లక్ష్యం అని కన్వీనర్ సంతోష్ రెడ్డి తెలిపారు. నాచార పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తామని సంతోష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ కన్వీనర్




కరాటే శ్రీరామ్, ఇంటలిజెర్స్ ఫోరం కన్వీనర్ కనకమెడల రాంబాబు, ఆటో వ్యాన్ జేఏసీల కన్వీనర్ గడ్డం శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక జేఏసీ కన్వీనర్ బొడ్డు శివ, అద్వైత ఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకుడు కొరపాక అంజి, ఎస్ ఎస్ ఎస్ యువసేన సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బీసీ రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు

### – ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి

ఏ ఎం న్యూస్ ఓయూ:



స్థానిక సంస్థల్లో పాటు చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి వెంటనే తెలంగాణ గవర్నర్ బీసీ బిల్లును ఆమోదించాలిని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేసి తొమ్మిది షెడ్యూల్లో బిసి బిల్లు చేర్చి బీసీ బిల్లులకు చట్టబద్ధత చేసి ఉభయ సభలో ఆమోదించాలన్నారు. అక్టోబర్ 18 న బీసీలు తలపెట్టిన తెలంగాణ రాష్ట్రం నందు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కొత్తపల్లి తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో, పాపారావు ఆదివాసి సంఘం అధ్యక్షులు, రమేష్, రాజు, చరణ్, అరుణ్, శివాజీ, రమేష్, నవీన్, శ్రీనివాస్, ప్రశాంత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలో కొత్త ఆలోచనతో జీవిద్దాం

### కొత్త భావి భారతాన్ని నిర్మిద్దాం

ఏఎం న్యూస్ / హైదరాబాద్ :




వన్ స్టాప్ సొల్యూషన్ ఫర్ యూత్ ఎన్జీవో ఆర్గనైజేషన్ 12వ సమావేశం వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల మరియు వాత్సల్య ఫార్మసీ కళాశాలలో జరిగింది దీనిలో భాగంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ చావా రాజ్ కుమార్ మాట్లాడుతూ Lead Today change Tomorrow అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సంస్థ, యువత కొత్త ఆలోచనలతో ముందుకు రండి భావి భారతాన్ని నిర్మించండి అని మీ ఆలోచనలు సకారం చేసే ఇది ఒక చర్చవేదిక young India young leadership కొత్త కొత్తగా ఆలోచించండి కొత్త ఆవిష్కరణ సృష్టించండి మీ ఆశయానికి మేము దిక్సూచి అవుతాం అని అన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అసిస్టెంట్ ప్రొఫెసర్ సుధగాని మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ నీలోని కొత్త ఆలోచనలు నీ యొక్క ప్రగతికి సోపానాలు ప్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ ధరిపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ, కొత్తగా ఆలోచించండి కొత్త తరాన్ని సురక్షించండి అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ కళాశాల అధ్యాపకులు మరియు వైస్ ప్రెసిడెంట్ అంభోజు మల్లేశం జాయింట్ సెక్రెటరీ యేంపాల కొండల్ రెడ్డి సార్ ట్రెజరీ వెంకట్ రాజు గౌడ్, జాయింట్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్ గాజుల వెంకటేష్ గౌడ్, శ్రవణ్ రెడ్డిగారు ,సంపత్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ పటేల్ నగర్‌లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




కెపిహెచ్బి కాలనీలోని సర్దార్ పటేల్ నగర్ లో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్ట్యూట్ వారి సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేజీఎఫ్ వ్యవస్థాపకులు జెట్టి కుసుమకుమార్ హాజరై మెడికల్ క్యాంప్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందలపు సాయి బాబు చౌదరి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేశారని ఎంతోమందికి చేదోడు వాదోడుగా అనునిత్యం ప్రజల్లో తిరుగుతూ ప్రజాసేవలో నిమగ్నమై ఉన్నారని కరోనాలో కూడా ఎంతోమందికి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అనునిత్యం సేవలను అందించారని కొని ఆడారు. ఇలాంటి వ్యక్తి రాబోయే రోజుల్లో ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ఎల్లప్పుడూ నా యొక్క సహాయ సహకారాలు అందుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భాను ప్రసాద్, రాఘవేంద్రరావు, ఎస్ ఆర్ మోటార్స్ శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, వసంత సునీల్, అన్నే బాబ్జి, చావా శ్రీనివాస్, కాజా నవీన్, నైన్ యాడ్స్ లక్ష్మణ్, గంగాధర్, రేఖా రాజు, బసవతారకం క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ నుండి డాక్టర్ అరవింద్, ప్రవల్లిక, రేణుక డాక్టర్,బిందు, డాక్టర్ కృష్ణ ప్రసాద్, 25 మంది స్టాప్, సుమారుగా 300మంది స్త్రీ పురుషులు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకున్నారు. స్థానికులు మాట్లాడుతూ ఇలాంటి గొప్ప హెల్త్ క్యాంప్ ని ఏర్పాటు చేసిన సాయి బాబు చౌదరిని అభినందించారు

## తెలంగాణ బంద్ విజయవంతం చేద్దాం..

### బీసీ రిజర్వేషన్లను సాధిద్దాం...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాలకు పిలుపుమేరకు శనివారం తెలంగాణ బంద్ లో పార్టీలకతీతంగా బీసీ నాయకులు అందరు పాల్గొని అన్ని బీసీ కుల సంఘాలు కూడా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా కూకట్పల్లి గౌడ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని తద్వారా తమ సమస్యలను సాధించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి గెలిపించండి

### - కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



75 పోలింగ్ బూత్‌ల స్థాయి కమిటీసమావేశం రహమత్‌నగర్ డివిజన్(జూబ్లీహిల్స్ నియోజకవర్గం) భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు తంగళ్ళపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎస్ కే ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది ఈకార్యక్రమానికి కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈకార్యక్రమంలో ప్రతిబూత్‌కు సంబంధించిన నాయకులు పాల్గొని కిషన్ రెడ్డి చెప్పిన విషయాలను ఆసక్తిగా విన్నారు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లంకాల దీపక్ రెడ్డి గెలుపే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో గౌతమ్ రావు బంగారు శృతి, అజయ్ పాల్గొన్నారు ఈ కార్యక్ర మంలో మల్లేష్ గుప్తా,చింటూ, భరత్ గౌడ్ పాల్గొన్నారు ఈకార్యక్రమంలో తంగళ్ళపల్లి లక్ష్మణ్ సమక్షంలో 30 మంది యువకులు కిషన్ రెడ్డి చేతుల మీదుగా కండువా కప్పుకొని బిజెపి పార్టీలో చేరారు.

## బిసి బందును విజయవంతం చేయండి

ఏ ఎం న్యూస్ శేర్లింగంపల్లి :



శేరిలింగంపల్లి నియోజకవర్గ బిసి జాక్ ఆదేశానుసారం ఆల్విన్ కాలనీ వివేకానంద నగర్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ కుమార్ యాదవ్, ఏకాంత్ గౌడ్, పుట్ట శివశంకర్ ల ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు వివిధ కులసంగాల నాయకులుతో కలిసి రాజ్యగ బాదంగా 42 శాతం బిసి రిజర్వేషన్లు అమలు అయ్యేతవరకు బిసిలు అందరూ ఏకతాటిపైకి రావాలని రేపు జరగబోయే తెలంగాణ బందూకు పూర్తి మద్దతు తెలుపుతూ శేరిలింగంపల్లి అన్ని డివిజన్లలో సంపూర్ణ బందుకు పిలుపునిచ్చారు. ఈ బందుకు అన్ని డిపార్ట్మెంట్ వాళ్ళు వివిధ సంఘాల వారూ వాణిజ్య వ్యాపార సంస్థలు ఆటో యూనియన్లు ఆర్టీసీ యూనియన్లు విద్యాసంగలు సహకరించి బందును విజయవంతం చేయవలసిందిగా వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇమంది వెంకట నర్సింగరావు, రాములు, నామాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లిలో ఘనంగా కాంగ్రెస్ శ్రేణుల జన్మదిన వేడుకలు

### జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బండి రమేష్...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుల జన్మదినోత్సవాలు శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో ఇన్చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన నాయకుడు శివ చౌదరి, ఓబిసి సెల్ చైర్మన్ నరేష్ కుమార్, అడ్వకేట్ రఘుపతిరెడ్డి సోను పుట్టినరోజు సందర్భంగా బండి రమేష్ వారికి శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. అనంతరం శివ చౌదరి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని వారి సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. తద్వారా ప్రజల్లో గుర్తింపు లభించి మంచి నాయకుడిగా ఎదిగేందుకు అవకాశాలు లభిస్తాయన్నారు.

## బి. రాజ్ కుమార్ పటేల్ సమక్షంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థిని మాగంటి సునీత..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



తెలంగాణ రాష్ట్రం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ని మాగంటి సునీత గోపినాథ్‌తో కలిసి వారికి మద్దతుగా యూసఫ్ గూడా డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్ (ఎ,బి) బ్లాక్‌లో ఇంటింటిప్రచారం నిర్వహించి సునీతమ్మను గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమం యూసుఫ్‌గూడా డివిజన్ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ సమక్షంలో శుక్రవారం జరిగింది. మాగంటి సునీత గోపీనాథ్ గెలుపే లక్ష్యంగా జరిగిన ఈ కార్యక్రమంలో కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ వచ్చేనెల 11(నవంబర్ 2025) వ తారీకు జరిగే ఉప ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుం దని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవా రెడ్డి , బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి శ్రీమతి అయేషా, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత పాల్గొ న్నారు వీరితో పాటు యూసఫ్ గూడా డివిజన్ అధ్యక్షులు నీలం సంతోష్ ముదిరాజ్, స్థానిక నాయ కులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణా నగర్ నివాసి, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, అందరినీ ఆప్యాయంగా పలకరించే అక్క కైసర్ జాన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ ఆశయాల కోసం కృష్ణానగర్ అభివృద్ధి కోసం మేము అభ్యర్థిని మాగంటి సునీతను గెలిపించుకునే దిశగా మా అడుగులు ఉంటాయని అన్నారు.

## 17 పోలింగ్ బూత్ నాయకులతో వి. నవీన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఇంచార్జి లక్ష్మణ్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



జూబ్లీ హిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ నామినేషన్ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడ డివిజన్ లక్ష్మీ నరసింహ నగర్ (ఎల్ ఎన్ నగర్) ఇన్ ఛార్జ్, మహబూబ్ నగర్ జిల్లా మూడ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్ వారి 17 బూత్ నాయకులతో కలిసి( ఈ నామినేషన్) కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ నాకు ఇన్చార్జి పదవి అప్పగించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ముందుగా కృతజ్ఞతలు చెబుతున్నాను అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ ను వచ్చే నెల 11వ తారీకు జరిగే ఉప ఎన్నికలు ప్రతి ఒక్కరు ను కలిసి చిరునామా సరిగ్గా ఉందా, వివరాలు సరిగ్గా ఉన్నాయా అనేది చూసి, వారికి ఓటు వేయవలసిన అవశ్యకత గురించి బూత్ స్థాయి నాయకుల మధ్య( 17 మంది బూత్ స్థాయి నాయకుల మధ్య) వివరించారు నా ఆధ్వర్యంలో 17 బూత్ ల లోని ప్రతి సభ్యుని కలుసుకునే విధంగా ముందుకు వెళ్తున్నామని అదేవిధంగా వారికి కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో చేసిన పనులు గురించి వివరిస్తున్నామని అన్నారు కాంగ్రెస్ పార్టీ నిర్ణయం మేరకు ఇక్కడికి వచ్చి 17 మంది పోలింగ్ బూత్ నాయకులకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ను గెలిపించాలని వారికి దిశ నిర్దేశం చేస్తున్నానని అన్నారు ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు, లక్ష్మీ నరసింహ నగర్ నివాసి, సోషల్ వర్కర్ బి రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

### వి. నవీన్ యాదవ్‌కు గజమాలతో

## స్వాగతం పలికిన గుర్రం సంజయ్ గౌడ్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా (జూబ్లీహిల్స్ నియోజకవర్గం) టికెట్ సంపాదించుకున్న వి. నవీన్ యాదవ్, వారి నామినేషన్ వేసే కార్యక్రమం శుక్రవారం వేలాది మంది కార్యకర్తల మధ్య యూసుఫ్‌గూడాలోని వారి క్యాంప్ కార్యాలయం నుండి షేక్పేట్ ఎమ్మార్వో ఆఫీస్ వరకు, నవీన్ యాదవ్ అభిమానుల మధ్య, మేళా తాళాలతో, వివిధ కళాకారుల ప్రదర్శనలతో ఘనంగా శుక్రవారం సాగింది ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్, మనసున్న మనిషి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం సంజయ్ గౌడ్ శ్రీకృష్ణ నగర్ మెయిన్ రోడ్ లోని లైబాస్ కేఫ్ వద్ద భారీ స్టేజ్ వేసి వి నవీన్ యాదవ్ కు భారీ గజమాలను ఏర్పాటు చేసి స్వాగతం పలిపారు ఈ కార్యక్ర మంలో వారి తండ్రి, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి,మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ నాయ కులు గుర్రం మురళి గౌడ్ పాల్గొన్నారు నవీన్ యాదవ్ ర్యాలీ సంజయ్ గౌడ్ ఏర్పాటు చేసిన స్టేజ్ వద్దకు రాగానే సంజయ్ గౌడ్ బ్యాండ్ కొట్టి స్వాగతం పలికి గజమాల ను భారీ క్రేన్ ద్వారా నవీన్ యాదవ్ కి సమర్పించారు ఈ కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అమిత్ రెడ్డి పాల్గొన్నారు

### ఎమ్మెల్యే అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ర్యాలీలో

## వారి పక్కన డివిజన్ యూత్ అధ్యక్షుడు తేజ..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు ప్రకటించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి. నవీన్ యాదవ్ నామినేషన్ వేసే కార్యక్రమం వేలాది యువకులు, వేలాది మహిళలు, వేలాది కార్య కర్తలు మధ్య యూసుఫ్ గూడా లోని క్యాంప్ కార్యాలయం నుండి షేక్పేట్ ఎమ్మార్వో కార్యాలయం వరకు ఘనంగా సాగింది. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ తేజ పాల్గొన్నారు ర్యాలీ లో నవీన్ యాదవ్ వెంట తేజ పాల్గొన్నారు నవీన్ యాదవ్ కి శాలువాతో ఘనంగా సన్మానించారు తేజ.ఈ కార్యక్రమంలో తేజ టీం లో సభ్యులైన గౌతం, అస్తాఫ్, అబ్బాస్, కార్తీక్ పాల్గొని నవీన్ యాదవ్ జిందాబాద్ అంటూ గట్టిగా అరుస్తూ ప్రతి ఒక్కరిలో జోష్ నింపారు ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ వచ్చేనెల 11 వ తారీకు(నవంబర్ 2025) జరిగే ఉప ఎన్నికల్లో వి. నవీన్ యాదవ్ అత్యంత భారీ మెజార్టీతో గెలిపించే దిశగా నా ప్రయత్నం ఉంటుందని అన్నారు యూత్ ఓటర్లను కలిసి వారికి కాంగ్రెస్ యూత్ ఓటర్లను కలిసి వారికి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి వారిని ఓటింగ్ లో పాల్గొనాలని కొరతామని అన్నారు.

## మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ వద్ద అధ్యాపకులు నిరసన

### – 48మందిని రిజెక్ట్ చేయడం దారుణం – సిఏఎస్ ప్రమోషన్లపై ఔటా ఆగ్రహం.

ఏ ఎం న్యూస్ ఓయూ:



ఉస్మానియా యూనివర్సిటీ సిఏఎస్ (క్యారియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్) ప్రమోషన్లలో విశ్వవిద్యాలయానికి చెందిన 48మంది అధ్యాపకులను ప్రమోషన్స్ ఇవ్వకుండా రిజెక్ట్ చేయడం దారుణమని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓయూలోని మ్యాథమెటిక్స్ బోటనీ, జువాలజీ విభాగాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఔటా అధ్యక్షుడు డాక్టర్ మనోహర్ మాట్లాడారు.. ఇంటర్వ్యూలలో పనితీరు బాగాలేదని చెప్పి అధ్యాపకులను రిజెక్ట్ చేయడం సమంజసం కాదన్నారు. గడచిన 50 ఏళ్లలో ఇలాంటి రిజెక్షన్ ఉదంతం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తమ అధ్యాపకులు, పరిశోధకులు కూడా ఈ జాబితాలో ఉండటం ఆందోళన కలిగించే విషయం అని పేర్కొన్నారు. అన్ని అర్హతలు ఉన్న అధ్యాపకులకు ప్రమోషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, ఓయూ వైస్‌చాన్సలర్‌ను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేందర్ రెడ్డి, ప్రొఫెసర్ వెంకట్ దాస్, ప్రొఫెసర్ రమేష్ బాబు, ప్రసర్ నాథనియెల్, డా. అరవింద్, ప్రొఫెసర్ శశికళ, డా. అపర్ణ, ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ రామచందర్, ప్రొఫెసర్ కమలాకర్ పాల్గొన్నారు.

### వెనుకబడిన తరగతులకు చెందిన అన్ని వర్గాల వారు

# బీసీ బందులో పాల్గొని విజయవంతం చేయండి

### – జాతీయ ఎంబీసీ డిఎన్టి సంక్షేమ సంఘం అధ్యక్షులు బంగారి నరసింహసాగర్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



రాష్ట్రంలో గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఏ సమాజానికి చెందిన వారు లేదా బీసీ వర్గాల వారు ఇతర వర్గాల వారు ఎంత సంఖ్య ఉంటే అంత సంఖ్య ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిన సందర్భంగా అట్టి విషయాన్ని ప్రజలు పరిగణలోకి తీసుకొని ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించడం జరిగిందన్నారు. కానీ ఒకదానికి ఒకటి పొంతన లేకుండా వ్యవహారం జరుగుతూ కాంగ్రెస్ పార్టీ బిసిలకు 42% ఇస్తామని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు రావడం అభినందనీయమే కానీ గతంలో కేసీఆర్ 27% ఉన్న బీసీల రిజర్వేషన్ ని ఒకే జీవతో తగ్గించి స్థానిక సంస్థలకు ఎన్నికలకు వెళ్లిన నాడు అది ఎలా చెల్లుబాటు అయిందో మరి ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన అన్ని పార్టీలు అసెంబ్లీలో ఆమోదించి, మద్దతు ఇచ్చినవి, రాష్ట్ర ప్రభుత్వం జీవో నైన్ తీసుకొచ్చిన మరి ప్రస్తుత కోర్టు న్యాయమూర్తులు ఎందుకు ఈ విధమైన వైఖరి వహిస్తున్నారు అన్నారు. ఎవరో ఒకరు పిటిషన్ వేస్తే అసెంబ్లీ తీర్మానం ముఖ్యమంత్రి క్యాబినెట్ తీర్మానం రాజ్యాంగపరంగా ఇచ్చిన జీవో అన్ని పనికిరావు అన్నట్టుగా కోర్టులు వివరిస్తున్నాయి మరి ఆనాడేమో కెసిఆర్ తెచ్చిన ఒకటే జీవో పెంచిన దాన్ని తగ్గిస్తే ఇమ్మీడియేట్లీ అమలులోకి వచ్చింది అన్నారు. ఆనాడు కోర్టులు ఎలాంటి చర్య తీసుకోలేదు మరి నేటి కోర్టులు ఈ విధంగా చేస్తున్నాయంటే తిట్టను పోరా గాడిద కొడకా అనే విధంగా ప్రభుత్వం వివరిస్తుందా? ఈ పరిపాలకులు వివరిస్తున్నారనేది నగ్నసత్యంగా మా భావన కావున ఓ బీసీ సమాజమా ఓ ఎంబిసి సమాజామా అదే విధంగా ఎస్సీ ఎస్టీ మిగతా అన్ని వర్గాల వారు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈరోజు బీసీలు ఇబ్బంది పడే వంతైతె ఎన్నడూ ఒకనాడు మిగతా వర్గాల వారిని కూడా ఇదే విధంగా చేసే దుస్థితిసి వస్తుంది కావున మనమందరం ఏకమై ఈ పాలకులకు ప్రజలందరూ ఏకమైనారు బీసీలకు 42% ఇవ్వడం న్యాయమైనదని భావన వచ్చే విధంగా మన అందరి ఉద్యమం ఉండాలని,అయ గ్రామాలలో ఉండే జడ్పిటిసి కార్పొరేటర్లు ఎంపీపీ ఎంపీటీసీ సర్పంచులు వార్డు మెంబర్లు మీరు ఏ పార్టీలో ఉన్న రేపు 18 తారీకు జరగబోయే బీసీ బందులో మీరందరూ బయటకు వచ్చి సంపూర్ణ బంధు జరిగే విధంగా ఎక్కడికి అక్కడ కృషి చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. ఎంబీసీ కుల సంఘాలు బీసీ కులాలు వివిధ కులాల వాళ్ళు అందరు కూడా రేపు జరగబోయే బందు ముఖ్యమంత్రి, వివిధ రాజకీయ పార్టీల నాయకులను కన్ను తెరిపించే విధంగా ఉండాలని అదేవిధంగా ద్వంద వైఖరి వహిస్తున్న కోర్టుల వ్యవహారాలు, కోర్టులలో ఉన్న న్యాయదేవత కళ్ళుకు కట్టిన బట్ట ఊడిపోయి కళ్ళు తెరిచే విధంగా ఈ అక్టోబర్ 18 బీసీ బంధు ఉండాలని ఈ బందులో ప్రతి ఒక్కరం పాల్గొనాలనిబంగారి నరసింహ పేర్కొన్నారు.

# ఆకట్టుకోలేక పోయిన తెలుసు కదా..మూవీ

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్న సిద్ధు జొన్నలగడ్డను 'జాక్' సినిమా రిజల్ట్ నిరాశ పర్చింది. దాంతో కాస్తంత జాగ్రత్త పడుతూ 'తెలుసు కదా' మూవీని చేశాడు. నీరజ కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ, ఈ మూవీని టీజీ విశ్వప్రసాద్, ఆయన కూతురు కృతి నిర్మించారు. వరుణ్ (సిద్ధు జొన్నలగడ్డ) ఓ అనాథ. అతని స్నేహితుడు అభి (వైవా హర్ష). ఇద్దరూ చిన్నప్పటి నుంచి కలిసే పెరుగుతారు. మొదటి నుండి తనకంటూ ఓ సొంత కుటుంబం ఉండాలని కలలుకంటూ ఉంటాడు సిద్ధు. తన ప్రమేయం లేకుండానే జరిగిన ఓ బ్రేకప్ తర్వాత బుద్ధిగా అంజలి (రాశీఖన్నా)ని పెళ్లి చేసుకుంటాడు వరుణ్. పెళ్ళి అయిన కొన్ని నెలలకే అంజలికి పిల్లలు పుట్టరనే విషయం తెలుస్తుంది. దాంతో సరోగసీ ద్వారా పిల్లలను కనాలని అనుకుంటారు. అందుకోసం రాగ కుమార్ (శ్రీనిధి శెట్టి) అనే డాక్టర్ ముందు కొస్తుంది. వరుణ్, అంజలికి తాను సరోగసీ ద్వారా బిడ్డ కంటానని చెబుతుంది. అందుకు వరుణ్ అంగీకరించాడా? వరుణ్ కూ రాగాకు ముందే పరిచయం ఉందా? ఆ పరిచయాన్ని ఎందుకు వీళ్ళిద్దరూ అంజలి దగ్గర దాచి పెట్టారు? దాని పర్యవసానం ఏమిటీ? అనేది మిగతా కథ. ముక్కోణ ప్రేమకథా చిత్రాలకు కొదవలేదు. ప్రతి యేడాది ఎన్నో అలాంటి సినిమాలు వస్తూనే ఉంటాయి. ఇది అదే తరహా రోమ్ కామ్ మూవీ అయినా... ఇందులో విషయం కాస్తంత భిన్నమైంది. ముక్కోణ ప్రేమకథ కంటే కూడా పెళ్ళైన తర్వాత ఓ యువకుడి జీవితంలో జరిగిన విచిత్రమైన సంఘటనలను బేస్ చేసుకుని సాగే కథ ఇది. కొత్తగా పెళ్ళైన ఓ జంట మధ్యలోకి సరోగసీ మదర్ గా ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ వస్తే ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయనే అంశంతో నీరజ కోన ఈ కథను రాసుకున్నారు.

ఫస్ట్ హాఫ్ ఆసక్తికరంగా సాగినా... సెకండ్ హాఫ్ లో వరుణ్ నిజాన్ని బయటపెట్టిన తర్వాత మూవీ స్పీడ్ తగ్గిపోయింది. అక్కడ నుండి క్లయిమాక్స్ వరకూ లవ్ అండ్ హేట్ రిలేషన్ లోనే కథంతా సాగింది. ఈ మూడు పాత్రల్లో ఎవరికి వారు... తాము తీసుకున్న నిర్ణయం కరెక్ట్ అనే భావనలో ఉన్నా... థియేటర్లోని ప్రేక్షకుడు మాత్రం ఎవరి పక్షానా నిలబడే పరిస్థితి ఉండదు. నాలుగు పాత్రల చుట్టూనే సినిమా అంతా సాగడం బోర్ కొట్టిస్తుంది. ద్వితీయార్థంలో డ్రామాను పక్కన పెట్టేసి, డైలాగ్స్ మీద మూవీని నడిపే ప్రయత్నం చేసింది నీరజా కోన. తీవ్రమైన భావోద్వేగాలను పండించాల్సి చోట పై పై సన్నివేశాలతో సినిమా సాగిపోయింది. లైఫ్ లో చిల్ అవ్వాలనుకునే కేర్ ఫ్రీ గర్ల్ గా శ్రీనిధి శెట్టి బాగానే చేసింది. రాశీ ఖన్నా పాత్ర హుందాగానే సాగినా సెకండ్ హాఫ్ లోని ట్విస్ట్స్ అండ్ టర్న్ ను ఎక్స్ ప్రెస్ చేయడంలో లోటు కనిపించింది. హీరో స్నేహితుడిగా వైవా హర్ష బాగా చేశాడు. అతని పాత్రే సినిమాలో కొంత రిలీఫ్ ను ఇచ్చింది. మిగిలిన మూడు, నాలుగు పాత్రలు ఇలా వచ్చి అలా వెళ్ళిపోయేవే... ఏ పాత్రకూ ప్రాధాన్యం లేదు.



# ఎల్లమ్మ సినిమా హీరోగా దేవిశ్రీప్రసాద్

## కోడై కూస్తున్న సోషల్ మీడియా




బలగం వేణు నిర్మించనున్న ఎల్లమ్మ సినిమాకు అరుదైన హీరో దొరికాడు. బలగం వంటి సూపర్ సక్సెస్ తర్వాత వేణు ఎల్లమ్మ అనే మరో చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. దిల్ రాజు ఈ సినిమాను నిర్మిస్తోండగా ఎడాదిన్నరగా హీరో విషయంలో తర్జన భర్జనలు జరుగుతూ ఉన్నాయి. నాని, నితిన్, శర్వానంద్, నిఖిల్, బెల్లంకొండ శ్రీనివాస్ ఇలా నలుగురైదుగురు పేర్లు తెరమీదకు వచ్చి పోవడం జరిగిపోయాయి. ఇక కథానాయికల విషయంలోనూ సాయి పల్లవి, కీర్తి సురేశ్‌ల మధ్యే చర్చలు నడుస్తున్నట్లు వార్తలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే.. తాజాగా ఈ స్థానంలోకి సంగీత దర్శకుడు దేవీ శ్రీ ప్రసాద్ పేరు రావడం సినీ లవర్స్‌ను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పుడు ఈ వార్త సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో హాల్‌చల్ చేస్తోంది. అంతేగాక ఈ సినిమాకు దేవీనే సంగీతం కూడా అందించనున్నట్లు సమాచారం.ఇప్పటికే డ్యాన్స్, నటనలోనూ దేవీకి అద్భుత ప్రతిభ ఉంది. అయితే ఈ వార్తల విషయంలో ఇప్పటివరకు అధికారిక ప్రకటన అయితే లేదు. మేకర్స్ , దర్శకుడు వేను, దిల్ రాజు, దేవీ శ్రీ ప్రసాద్ స్వయంగా స్పందిస్తే తప్ప ఈ వార్తలపై క్లారిటీ రాదు. ఇదిలాఉంటే.. కుమారి 21ఎఫ్ సినిమా సమయంలో దేవి శ్రీ ప్రసాద్‌ని నా ఎస్వీసీ బ్యానర్ లో సుకుమార్ దర్శకత్వంలో హీరోగా పరిచయం చేస్తాను అని దిల్ రాజు గతంలోనే మాట ఇచ్చాడు. కానీ దశాబ్దం గడిచినా అది ముందుకు పడలేదు. ఇప్పుడు ఈ చిత్రంతో అటు వేణు, ఇటు డీఎస్పీ ఇద్దరిని కలిపి సినిమా తీస్తే దిల్ రాజు ఇచ్చిన మాట కూడా నేరవేరినట్లే అవుతుందని టాక్ వినిపిస్తోంది. అయితే ఎల్లమ్మ సినిమా విషయంలో ఎలాంటి వార్తలు వస్తాయో ఎదురు చూడాలి.



# సరదాగా సాగే కథతో కె ర్యాంప్

## హీరో కిరణ్ అబ్బవరం వెల్లడి

'ఈ సినిమా చేయాలని అనుకున్నప్పుడే దీపావళికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ఖచ్చితంగా కుటుంబ సభ్యులందరూ కలసి చూసే చిత్రం అవుతుందని నమ్మాం. మేము అనుకున్న దానికంటే సినిమా బాగా వచ్చింది. నన్నూ, మా చిత్ర బృందాన్ని నమ్మండి. ఈ దీపావళి పండుగ 'కె.ర్యాంప్' తో మరింత సరదాగా ఉంటుంది. ఇకపై నా అభిమానులు గర్వపడేలా సినిమాలు చేస్తా' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా ఇంకా ఆయన మాట్లాడుతూ.. మాపై నమ్మకంతో రండి కడుపుబ్బా నవ్వించి తీరుతాం అని థియేటర్‌లో ఒక్కొక్కడికి బుర్రపాడు.. గుడ్డలు జారుడే అనేలా సినిమా ఉంటుందన్నారు. టికెట్ డబ్బులు వేస్ట్ అయ్యాయనే మాట రానివ్వమని అన్నారు. జైన్స్ నాని మాట్లాడుతూ 'సినిమా క్లైమాక్స్‌లో ఒక చిన్న ట్విస్ట్ ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంటుంది. అన్ని వాణిజ్య హంగులతో తెరకెక్కించాం. కిరణ్ అబ్బవరం పాత్రచిత్రణ సరికొత్తగా ఉంటుంది. ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రను ఈ చిత్రంలో పోషించారు. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది' అని చెప్పారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ సినిమాను 47 రోజుల్లో పూర్తి చేశాం. కేరళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిత్రీకరణ చేశాం. సెట్‌లో ప్రతి రోజూ నవ్వుకున్నాం. సెట్‌లో నవ్వించిన ఏ సినిమా కూడా సక్సెస్ విషయంలో గురి తప్పలేదు. 'కె- ర్యాంప్' కూడా మంచి విజయాన్ని అందుకుంటుంది' అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూసిన తర్వాత అందరూ మహేశ్ బాబు, అల్లు అర్జున్, నాని తర్వాత కిరణ్ పేరే చెబుతారు. చేతన్ భరద్వాజ్ మంచి సంగీతం




అందించారు. భవిష్యత్తులో జైన్స్ నాని పెద్ద దర్శకుడు అవుతాడు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, నటుడు సాయికుమార్, హీరోయిన్లు విమలా రామన్, కామ్నా జెఠ్మలానీ, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ పాల్గొన్నారు.



Mana Cinemalu

# సామ్రాజ్యం ప్రోమో విడుదల చేసిన ఎన్టీఆర్



తమిళ అగ్ర హీరో శిలంబరసన్ టీఆర్ అలియాస్ శింబు హీరోగా జాతీయ అవార్డు దర్శకుడు, క్రియేటివ్ జీనియస్ వెట్రిమారన్ తెరకెక్కిస్తున్న చిత్రం అరసన్. తెలుగులో సామ్రాజ్యం పేరుతో రానుంది. తాజాగా ఈ చిత్రం ప్రోమోను యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఎక్స్ ద్వారా శుక్రవారం ఉదయం విడుదల చేశారు. ఇంకా షూటింగ్ పూర్తిగా పట్టాలెక్కని ఈ చిత్రం ఉత్తర చెన్నై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్ కథతో రూపొందుతుండగా అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా విడుదల చేసిన ప్రోమో 4 నిమిషాలకు పైగా ఉండడమే గాక చూస్తే చాలా రా అండ్ రస్టిక్ లాగా ఉంది. హాత్యా నేరం అభియోగంతో కోర్టుకు వచ్చిన హీరో జడ్జి ముందు నాకేమీ తెలియదు నన్ను ఇరికించారు అని చెబుతూనే మరో వైపు యంగ్ హీరో ముగ్గురిని నరికి చేతులు కడిగే సన్నివేశాలను ప్రజెంట్ చేశారు. బ్యాగ్రౌండ్ స్కోర్ కూడా బాగానే ఉంది. ప్రోమో ఆరంభఃలో జైలర్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ ఎంట్రీ అతనితో హీరో మాట్లాడే డైలాగ్స్ అదిరిపోయాయి. ముఖ్యంగా నా స్టోరీని ఎవరితో చేపిద్దామనుకుంటున్నారు.. ఎన్టీఆర్‌తో చేపించండి కుమ్మేస్తాడు అంటూ శింబ ఉచెప్పే డైలాగ్ ఆకట్టుకునేలా ఉంది. గతంలో వెట్రిమారన్, ధనుష్ కాంబోలో వచ్చిన వడ చెన్నై సినిమాను యూనివర్స్‌గా మార్చి అందులో ఓ పార్ట్‌గా ఈ సినిమాను తీసుకు వస్తున్నారు. ఇదిలాఉంటే ఈ చిత్రంలో సమంత, కీర్తి సురేశ్, సాయి పల్లవిలు ముగ్గురిలో ఇద్దరు కథానాయికలుగా చేయనున్నట్లు తెలుస్తోంది.

# 650 కోట్ల వసూళ్లను దాటేసిన కాంతారా




కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇప్పటికే ఇప్పటికే రూ.650 కోట్లను అలవోకగా దాటి బాహుబలి ది బిగినింగ్ రికార్డును బద్దలుకొట్టిన ఈ చిత్రం తాజాగా గదర్ 2 రికార్డును అధిగమించింది. గదర్ 2 చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.700 కోట్ల వసూళ్లను సాధించగా.. ఈ రికార్డును చెరిపివేస్తూ.. కాంతార రూ.717 కోట్లతో దూసుకుపోతుంది. దీంతో దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన టాప్-20 చిత్రాల్లో కాంతార 16వ స్థానానికి ఎగబాకింది. 2025లో అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల్లో రెండో ప్లేస్ దక్కించుకుంది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటించగా గుల్షన్ దేవయ్య, జయరాజ్ కీలక పాత్రల్లో నటించారు.